Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143




Editor : Dama Vijaya Kumar | Volume : 2 | issue: 45 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 2 | సంచిక :45 | ఆదివారం 15 ఫిబ్రవరి 2026 | వెల : 3 | పేజీలు : 4

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు కోబ్రా కమాండోల దుర్మరణం
- ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు కోబ్రా కమాండోల మృతి చెందారు
- ధమ్తరి జిల్లాలో ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టిన కమాండోల కారు
- ఈ ఘటనలో మరో కమాండోకు తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం



## భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో రూ.40 కోట్ల విలువైన హెరాయిన్ జారవిడిచిన డ్రోన్

- శుక్రవారం రాత్రి అనుమానిత డ్రోన్ కదలికలను గుర్తించిన స్థానికులు
- డ్రోన్ ఏదో పదార్థాన్ని జారవిడిచినట్లు గుర్తించిన స్థానికులు
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు



## ఈశాన్యంలో చారిత్రక ఘట్టం

- తొలి 'ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ'
- హైవేపై దిగిన మోదీ విమానం
- ఈశాన్య భారతంలో తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ హైవే ప్రారంభం
- ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై సీ130 జే విమానంలో దిగిన ప్రధాని
- చైనా సరిహద్దుల్లో కీలకంగా మారనున్న ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ





## కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుంది

- హస్తం పార్టీపై మోదీ విమర్శలు
- అసోంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన
- విపక్ష కాంగ్రెస్ పార్టీపై ప్రధాని ఫైర్
- కాంగ్రెస్ పాలనలో అసోం భయం గుప్పిట్లో ఉండేదని ఎద్దేవా
- 'కాంగ్రెస్ హయాంలోనే 2జీ, 3జీ టెక్నాలజీ- అలాగే 2జీ స్కామ్ కూడా'

## ప్రజల రాజధాని 'అమరావతి'ని నిర్మించాలనే నిబద్ధతతో ప్రభుత్వం పనిచేస్తోంది

- 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన మంత్రి
- రూ.57,868 కోట్ల విలువైన 97 పనులకు పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు వెల్లడి
- 10 ప్రాధాన్యతాంశాలను ప్రకటించిన పయ్యావుల




**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ప్రజల రాజధాని అమరావతిని నిర్మించాలనే నిబద్ధతతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్‌ను ఆయన శనివారం శాసనసభలో ప్రవేశపెట్టారు. స్వయం సమృద్ధి నమూనాలో వివిధ ఆర్థిక సంస్థల ద్వారా నిధులను సమీకరించి రాజధాని పనులను వేగంగా ముందుకు తీసుకెళుతున్నామని ఈ సందర్భంగా తెలిపారు. - మిగతా3లో

# 3,35,205

## 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.3,32,205 కోట్లతో బడ్జెట్ రూపకల్పన



శాసనసభలో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

- బడ్జెట్: రూ.3,32,205 కోట్లు
- రెవెన్యూ వ్యయం: రూ.2,56,143 కోట్లు
- మూలధన వ్యయం: రూ.53,915 కోట్లు
- రెవెన్యూ లోటు: రూ.22,002 కోట్లు
- ద్రవ్య లోటు: రూ.75,868 కోట్లు

*శాసనసభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. వరుసగా మూడోసారి పయ్యావుల బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఒకసారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్, 2 సార్లు పూర్తి స్థాయి బడ్జెట్‌లను మంత్రి ప్రవేశ పెట్టారు.*

3



## ఉగ్రదాడులకు కాంగ్రెస్ జవాబివ్వలేదు

- మోదీ ప్రభుత్వం వాళ్ల ఇంటికెళ్లి కొట్టింది: అమిత్ షా
- కాంగ్రెస్ పాలనలో ఉగ్రదాడులకు సరైన సమాధానం దొరకలేదు
- మోదీ ప్రభుత్వం హయాంలో సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులకు గట్టి సమాధానం చెప్పారు- అమిత్ షా కీలక వ్యాఖ్యలు




## గ్రూప్-1 నియామకాల్లో అక్రమాలు!

- దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఏపీపీఎస్సీలో అక్రమాలపై దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటుకు ఉత్తర్వులు
- 27/2018 నోటిఫికేషన్ నియామకాల్లో అక్రమాలపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు
- హైకోర్టులో ఈ ఏడాది ఫిబ్రవరి 11న రిట్ అప్పీల్, అనుబంధ పిటిషన్లు దాఖలు
- అక్రమాలను వెలికితీసేందుకు ప్రత్యేక దర్యాప్తు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఏపీపీఎస్సీలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 27/2018 నోటిఫికేషన్ నియామకాల్లో అక్రమాలు జరిగాయని హైకోర్టులో ఈ ఏడాది ఫిబ్రవరి 11న రిట్ అప్పీల్, అనుబంధ పిటిషన్లు దాఖలు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు అక్రమాలపై దర్యాప్తునకు ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. చీఫ్ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేశారు. మరో సభ్యుడిగా జ×ణ ఎస్పీ కె.చక్రవర్తి నియమితులయ్యారు. దర్యాప్తునకు సంబంధించి సిట్‌కు అన్ని అధికారాలు అప్పగించారు. సోదాలు చేసేందుకు, ఆధారాల స్వాధీనానికి ఎలాంటి - మిగతా3లో

## ముక్కంటి అన్నదానానికి విరాళం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి14:**
శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన బొబ్బా ధనశేఖర్, సునీత దంపతులు రూ.15,116లు విరాళంగా అందించారు. ఆలయ ఈవో టి.బాపిరెడ్డి ఈ విరాళం స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలియచేసి దర్శన ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో మోహన్ పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలించండి
## శ్రీకాళహస్తీశ్వరలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొట్టే సాయి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 14:**
శ్రీకాళహస్తి శ్రీకాళహస్తిలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో బాల్య నిర్మూలించాలంటూ శ్రీకాళహస్తిలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ భారీ ర్యాలీని చేపట్టారు. సుమారు 200 మంది స్కౌట్స్, గైడ్స్ రోవర్లు, రేంజర్లు ప్ల కార్డులు చేతపట్టుకుని పట్టణ వీధులలో వద్దు.. వద్దు.. బాల్య వివాహాలు వద్దు బాల్యం వయస్సులో పుస్తెల భారం వద్దంటూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీని రాజగోపురం వద్ద నుండి శ్రీకాళహస్తీశ్వరలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే వయస్సులో వివాహలను చేయడం చట్ట రీత్యా నేరమని, అట్లు ప్రోత్సాహించిన వారిపై కూడా కేసులు నమోదు అవుతాయనన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలలో కూడా భక్తులకు సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమీషనర్లు ఎం ఎం రెడ్డి, టి. రమేష్ బాబు, యూత్ చైర్మన్ అజారుద్దీన్, గైడ్ కెప్టెన్లు, పద్మావతి, నిర్మల, సరిత, స్కౌట్స్ మాస్టర్లు మురళి, సుబ్రహ్మణ్యం, మహేంద్ర, సుబ్రహ్మణ్యం, ధనుష్, మణి కంఠ, రోవర్ లీడర్ ఆంజనేయులు, జ్యోతి, మణికంఠ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ టూ బూత్ ప్రతి సమాచారం
## లీడర్ టు కేడర్ క్షణాల్లో మీకు అందించేది
## మై టిడిపి యాప్.. గంధమనేని



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 14:**
గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్‌పురం మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎస్ఆర్ పురం మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు అధ్యక్షతన మై టిడిపి యాప్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు మాట్లాడుతూ... గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆదేశాలతో మై టిడిపి యాప్ పోస్టర్లు ఆవిష్కరించి మై టిడిపి అఫ్ వల్ల ఉపయోగాలను తెలియజేశారు. అలాగే ఈ మై టిడిపి యాప్ స్టేట్ టూ బూత్ ప్రతి సమాచారం లీడర్ టు కేడర్ క్షణాల్లో మీకు మై టిడిపి అఫ్ అందిస్తుందని తెలియజేశారు. అలాగే ప్రతి క్లస్టర్ ఇంచార్జి బూత్ ఇంచార్జి మై టిడిపిఅప్ గ్రామాల్లో టిడిపి నాయకులకు కార్యకర్తలకు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగల్ రెండూ చైర్మన్ నిరంజన్ రెడ్డి మాజీ మండల అధ్యక్షుడు భాస్కర్ నాయుడు టిడిపి సీనియర్ నాయకుడు బాలాజీ నాయుడు,జలంధర్ నాయుడు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తరుగు పూర్ణిమ బాబు మండల కార్యదర్శి వెంటచలం నియోజకవర్గం ఎస్సీ సెల్ కార్యదర్శి కుమార్, మండల యువత అధ్యక్షుడు చంద్రబాబు రెడ్డి వల్ల దేవరాజు నాయుడు, జై చంద్ర గజేంద్ర, సూర్ రెడ్డి రామిరెడ్డి గల్లా రాజ్ కుమార్ వినోద్ కేయం రవి నరసింహారెడ్డి, చిన్నబా రాజు,నాగరాజు వేణుగోపాల్ శెట్టి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పైనేని మురళి జన్మదిన వేడుకలు



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి14:**
గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఐటీడీపీ మాజీ అధ్యక్షులు ఎస్ఆర్ పురం మండల టిడిపి యువ నాయకుడు పైనేని మురళి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు శనివారం ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లి మిట్టలో శ్రీనివాస ట్రేడర్స్ ఆవరణంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు మిత్రులందరూ కలిసి కేక్ కట్ చేసి టపాకాయలు పేల్చి ఘనంగా గజమాలతో సన్మానించి పైనే మురళికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ ట్రేడర్స్ అధినేత శ్రీనివాసులు రెడ్డి చాణిక్య తులసి, దాము, మాబు భాష, కేఎం రవి, మధు,సిద్దయ్య శెట్టి, చిన్నబ్బ రాజు,నాగరాజు, త్యాగరాజు నాయుడు, పైనేని బాలాజీ, మహేష్, భూపతిరెడ్డి, జీవన్, కిరణ్ చౌదరి ప్రసాద్ చౌదరి, కుమరేష్ వినోద్ డిల్లీ,వంశీ పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు
# ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పణ





**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి14:**
శ్రీకాళహస్తి దక్షిణ కైలాసంగా పేరుగాంచిన శ్రీకాళహస్తి క్షేత్రంలోని శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మాత్యులు ఆనం రామనారాయణరెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు తీసుకువచ్చిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు కొట్టే సాయిప్రసాద్, ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి, ఆలయ అధికారులు సంప్రదాయ బద్దంగా సుపథ మండపం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అక్కడ నుంచి మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య పట్టు వస్త్రాలను ఆలయం లోపలకు తీసుకువచ్చారు. అలంకార మండపంలో ఈ పట్టు వస్త్రాలను ఆలయ సంప్రదాయాలతో వేద పండితులకు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి స్వామి, అమ్మవార్ల ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టరు డాక్టర్ ఎస్. వేంకటేశ్వర్, దేవదాయశాఖ కమిషనరు రామచంద్రమోహన్, ఆర్డీఓ భానుప్రకాశ్ రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## హంస–చిలుక వాహనాలపై భక్తులకు అభయం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 14:**
శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 5వ రోజైన శనివారం ఉదయం గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి హంస వాహనం పైనా... జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు చిలుక వాహనం పైనా పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఆలయం వెలుపల నుంచి మంగళ వాయిద్యాలు, కోలాటాలు, పండరి భజనలు, శక్తి అమ్మవార్ల వేష ధారణలతో భక్త బృందాలు వాహన సేవల ముందు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మొదట అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేషంగా అలంకరణ చేశారు. ఆలయ పురోహితులు పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పురవిహారానికి తీసుకువచ్చారు. వినాయక స్వామి, శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప స్వామి, అమ్మవార్లను అనుసరించారు. పురవీధుల్లో ఊరేగుతున్న పంచమూర్తులను పలువురు భక్తులు దర్శించు కున్నారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో ధర్మకర్తల మండలి అధ్యక్షులు కొట్టే సాయిప్రసాద్, ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి, మండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా
## మందులు, వాటర్ బాటిల్స్ పంపిణీ



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి14:**
శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తి కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ తరపున సుమారు రూ.80,000 విలువైన మందులు మరియు వాటర్ బాటిల్స్‌ను దేవస్థానానికి అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బృందమ్మ, సతీమణి బొజ్జల రీషితా రెడ్డి చేతుల మీదుగా ఆలయ ఆవరణలో ఈ సామగ్రిని అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈ.ఓ. ఎన్.ఆర్. కృష్ణా రెడ్డి , ట్రస్ట్ బోర్డ్ సభ్యులు అందజేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి భారీగా తరలివచ్చే భక్తుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ఈ సహాయం అందించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రిని కలసిన టీడీపీ నేతలు

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి14:**



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శుక్రవారం రాత్రి ప్రభుత్వం విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు జిల్లా శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి, వారి నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. ప్రజల్లో నిత్యం ఉండి, ప్రజా సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు.

## మాదకద్రవ్యాల నివారణకు పోలీసుల అవగాహన



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 14:**
జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు జిల్లా అంతటా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో చిత్తూరు 2 టౌన్ ఇన్స్పెక్టర్ నెట్టికంటయ్య భద్ర 7 సిబ్బందితో కలిసి టెలిఫోన్ కాలనీలోని ఆదర్శ విద్యామందిర పాఠశాలలో కార్యక్రమం చేశారు.పాఠశాల యాజమాన్యం, కరస్పాండెంట్, ఉపాధ్యాయుల సమక్షంలో సుమారు 1000 మంది విద్యార్థులు, తల్లిదండ్రులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 2 టౌన్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు నో చెప్పాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం, కుటుంబ జీవితం, భవిష్యత్తు నాశనం అవుతాయని ఉదాహరణలతో వివరించారు. చిన్న వయసులో చెడు అలవాట్లకు బానిస కావడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలను స్పష్టం చేశారు.మహిళలు, పిల్లలపై జరిగే నేరాలు, వాటికి కఠిన చట్టపరమైన పరిణామాలు, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. సోషల్ మీడియా వ్యసనం వల్ల చదువు, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు, రోడ్డు భద్రతకు హెల్మెట్ తప్పనిసరి వాడకం గురించి చర్చించారు. విద్యార్థులే దేశ భవిష్యత్తు, మంచి అలవాట్లు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, పోలీసుల లక్ష్యం ముందస్తు నివారణ అని చెప్పారు.కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా "ధైర్య స్పర్శ" హాట్‌స్పాట్‌ల పరిశీలన
## ప్రజా భద్రతకు మరో కీలక అడుగు



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 14:**
భయానికి ముగింపు, భద్రతకు ఆరంభం నినాదంతో జిల్లా ప్రజల భద్రతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆలోచనాత్మక 'ధైర్య స్పర్శ' కార్యక్రమాన్ని పోలీసులు విస్తృతంగా అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా హాట్‌స్పాట్ల పరిశీలనకు దారితీసింది. ఈ క్రమంలో శనివారం రోజు ఎఎస్ పి డాక్టర్ తరుణ్ పహ్వా, అమరరాజా సంస్థ ప్రతినిధులు, ఎస్‌బి ఇన్స్పెక్టర్ మురళి అంతా కలిసి అన్ని క్రైమ్ హాట్‌స్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చిత్తూరు II టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో దుర్గానగర్ కాలనీ, సంతపేట పిఎన్ సి హై స్కూల్, విజయలక్ష్మి కాలనీ ప్రవేశ ద్వారం వంటి ప్రాంతాల్లో లైటింగ్, సీసీ కెమెరాలు, పట్రోలింగ్, ప్రజల అవగాహనపై చర్చించి సూచనలు ఇచ్చారు. చిత్తూరు 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంగినేని చెరువు వద్ద ఫారెస్ట్ రోడ్ సమీపంలో భౌగోళిక పరిస్థితులు, రాకపోకలు, గత ఘటనలను సమీక్షించారు. కార్వేటినగరం, పుల్లూరు, గంగవరం, పలమనేరు, పూతలపట్టు వంటి ప్రాంతాల్లో అదనపు పట్రోలింగ్, సాంకేతిక పర్యవేక్షణ, స్థానికుల సమన్వయంపై చర్చించి చర్యలు నిర్ణయించారు. ఈ కార్యక్రమం ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో ధైర్యం, పోలీస్–ప్రజల మధ్య నమ్మకం పెంచడం లక్ష్యమని అధికారులు తెలిపారు. మౌలిక సదుపాయాల మెరుగుదల, సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని ప్రభావవంతంగా కొనసాగిస్తామని చెప్పారు.కార్యక్రమంలో అమరరాజా సంస్థ తరఫు లక్ష్మీ నారాయణ, భక్తవత్సలం నాయుడు, ప్రాజెక్ట్ టీమ్ లీడ్ సుజాంత్, బృందం పాల్గొన్నారు.

## టీడీపీ నేతలు జాకీర్, ఉమాపతిలు చేత
## సిటీ ప్యాలస్ టీ షాప్ ప్రారంభం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి14:**
కుప్పం పట్టణంలో సిటీ ప్యాలస్ టీ షాప్ శనివారం పట్టణంలోనీ నేతాజీ రోడ్డులో ప్రారంభో త్సవ కార్యక్రమంలో టీడీపీ కుప్పం నియోజకవర్గ మైనార్టీ విభాగ అధ్యక్షులు కౌన్సిలర్ జాకీర్, మాజీ ఎంపిటిసి ఉమాపతిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి షాప్ యజమాని మహమ్మ ద్ అలీ పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం జాకీర్, ఉమాపతిలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# 3,32,205 కోట్లతో ఏపీ బడ్జెట్

శాసనసభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. వరుసగా మూడోసారి పయ్యావుల బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఒకసారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్, 2 సార్లు పూర్తి స్థాయి బడ్జెట్‌లను మంత్రి ప్రవేశ పెట్టారు. అనంతరం ప్రసంగాన్ని ప్రారంభించారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా పరుగుల పెట్టించాలనే సంకల్పం లాంటిదని మంత్రి పేర్కొన్నారు.

**బడ్జెట్ కేటాయింపులు:**

2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ సంక్షేమ పథకాలు, వివిధ కార్యక్రమాలకు నిధులు కేటాయించారు. ఎన్టీఆర్ భరోసా పథకానికి రూ.27,719 కోట్లు, దీపం 2.0 - రూ.2,601 కోట్లు, వివిధ వర్గాలకు ఆర్థిక మద్దతుకి రూ.2,320 కోట్లు, స్త్రీశక్తి రూ.1,420 కోట్లు, వీకర్ సెక్షన్లకు సబ్సిడీ, ఉచిత విద్యుత్ - రూ.600 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో రూ.450 కోట్లు, తల్లికి వందనం రూ.9,668 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమం రూ.4,581 కోట్లు, ఉపకారవేతనాలు రూ.3,836 కోట్లు, రూ.సమగ్ర శిక్ష 2,946 కోట్లు, రూ.ఉన్నత విద్య 2,566 కోట్లు కేటాయించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి రూ.2,161 కోట్లు, మన బడి, మన భవిష్యత్ రూ.1,500 కోట్లు, నైపుణ్యాభివృద్ధి రూ.1,232 కోట్లు, పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా రూ.707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర రూ.654 కోట్లు, యువత, క్రీడలకు రూ.438 కోట్లు, వీబీజీ రామ్‌జీకి రూ.8,365 కోట్లు, గృహ నిర్మాణం రూ.5,451 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవ రూ.4,000 కోట్లు, జల్‌జీవన్ మిషన్ రూ.4,000 కోట్లు, స్వచ్ఛభారత్ మిషన్ రూ.1,037 కోట్లు, ఆయుష్మాన్ భారత్ రూ.838 కోట్లు కేటాయించారు.

**వ్యవసాయం-నీటి భద్రత కేటాయింపులు**

2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం-నీటి భద్రత కేటాయింపులు చేశారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.9,906 కోట్లు, అన్నదాత సుఖీభవ రూ.6,600 కోట్లు, రూ.పోలవరం 6,105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రూ.1,927 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.500 కోట్లు, మత్స్యకార సేవలో రూ.260 కోట్లు, పంటల బీమా రూ.250 కోట్లు, పీఎం కృషి సించాయి యోజన రూ.190 కోట్లు కేటాయించారు.

**మూలధన వ్యయం పెంపు**

మూలధన వ్యయాన్ని గత బడ్జెట్ కంటే ప్రభుత్వం పెంచింది. 2025-26 రివైజ్డ్ అంచనాల్లో మూలధన వ్యయం 39,497.56 కోట్లు ఉండగా, 2026-27 బడ్జెట్ అంచనాల్లో మూలధన వ్యయం రూ.53,915.38 కోట్లు పెంచింది. గత ఏడాది కంటే మూలధన వ్యయాన్ని రూ.14,417.82 కోట్ల మేర ప్రభుత్వం పెంచింది. మూలధన వ్యయం పెంచడం ద్వారా ఆస్తుల కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేసిందని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. మూలధన వ్యయానికి ఎక్కువ కేటాయింపులు జరపలేదని గత ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయని మూలధన వ్యయం కేటాయింపుల విషయంలో నాటి వైఎస్సార్సీపీ ప్రభుత్వ విధానాన్ని వివిధ సందర్భాల్లో కాగ్ తప్పు పట్టిందని పయ్యావుల వెల్లడించారు.

**పన్నుల ద్వారా ఆదాయం**

2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో రూపాయి రాక పన్నుల ద్వారా ఆదాయం 38 శాతం, పన్నేతర ఆదాయం 3 శాతం, బహిరంగ మార్కెట్ రుణాలు 30 శాతం, కేంద్ర పన్నుల్లో వాటా 19 శాతం, గ్రాంట్ ఇన్ ఎయిడ్ 10 శాతం ఉంది. రూపాయి పోక సంక్షేమం 17 శాతం, విద్య 11 శాతం, ఆర్థికం 8 శాతం, పంచయతీరాజ్, గ్రామీణాభివృద్ధి 7 శాతం, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం 6 శాతం, జలవనరులు 6 శాతం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ 4 శాతం, విద్యుత్ రంగం 4 శాతం, వ్యవసాయం, అనుబంధ రంగాలు 4 శాతం, ఇతరాలు (హోం, ఆర్ అండ్ బీ, పరిశ్రమలు) 15 శాతం, వడ్డీలు, రుణాల చెల్లింపులు 18 శాతంగా పేర్కొన్నారు.

**రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు**

రెవెన్యూ లోటు గణనీయంగా తగ్గింది. 2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ.41,118.36 కోట్లు ఉండగా, 2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.22,002.50 కోట్లు ఉండనుంది. 2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం ద్రవ్యలోటు రూ.80,567.47 కోట్లు ఉంటే, 2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ.75,868.09 కోట్లు ఉండనుంది. న్నుల ద్వారా ఆదాయం 38 శాతం, పన్నేతర ఆదాయం 3 శాతం, బహిరంగ మార్కెట్ రుణాలు 30 శాతం, కేంద్ర పన్నుల్లో వాటా 19 శాతం, గ్రాంట్ ఇన్ ఎయిడ్ 10 శాతం రానుంది. సంక్షేమం ద్వారా 17 శాతం, విద్య 11 శాతం, ఆర్థికం 8 శాతం, పంచయతీరాజ్, గ్రామీణాభివృద్ధి 7 శాతం, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం 6 శాతం, జలవనరులు 6 శాతం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ 4 శాతం, విద్యుత్ రంగం 4 శాతం, వ్యవసాయం, అనుబంధ రంగాలు 4 శాతం, ఇతరాలు (హోం, ఆర్ అండ్ బీ, పరిశ్రమలు) 15 శాతం, వడ్డీలు, రుణాల చెల్లింపులు 18 శాతం జరుగనున్నాయి.

**ప్రజలకు తెలియాలనే ప్రస్తావించాం**

ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వివిధ రకాల చర్యలను బడ్జెట్‌లో మంత్రి పయ్యావుల ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల చెల్లింపులు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఆర్థిక కార్యాకలాపాల పునరుద్దరణ చర్యలను మంత్రి బడ్జెట్లో ప్రస్తావించారు. స్థానిక సంస్థలకు బదలాయించిన నిధులు, అధిక రుణాలపై వడ్డీలను తగ్గించేందుకు జరిపిన సంప్రదింపుల వివరాలను బడ్జెట్లో ప్రభుత్వం పొందుపరిచింది. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలకు తెలియచేయడం కోసమే వివరాలను బడ్జెట్టులో ప్రస్తావించామని ప్రభుత్వం వర్గాలు తెలిపారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపై వడ్డీలు తగ్గించమని వివిధ సంస్థలతో సంప్రదింపులు జరిపామని మంత్రి పయ్యావుల వెల్లడించారు. 12.3 శాతంగా ఉన్న వడ్డీని 9 శాతానికి తగ్గించేలా ఆయా ఆర్థిక సంస్థలను ఒప్పించామన్నారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాల్లో ఇప్పటి వరకు రూ.43,298 కోట్ల మేర రుణాలకు వడ్డీలు తగ్గించాలని సంప్రదింపులు జరిపామన్నారు. సంప్రదింపుల ఫలితంగా ఏడాదికి రూ.327 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు. మరో రూ.1.20 లక్షల కోట్లకు వడ్డీ రేట్లు తగ్గించాలని సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల్లో రూ.24,811 కోట్లు చెల్లింపులు జరిపామన్నారు. ఆర్థిక కార్యాకలాపాల పునరుద్దరణకు ఇరిగేషన్, రహదారుల పనుల కోసం కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రూ.37,030 కోట్లు వ్యయం చేశామన్నారు. పంచాయతీలు, మున్సిపాల్టీల బలోపేతం నిమిత్తం ఇప్పటి వరకు ఫైనాన్స్ కమిషన్ నిధులను రూ.3,797 కోట్ల మేర బదలాయించామన్నారు.

**స్కీంల పునరుద్దరణకు రూ.18,701 కోట్లు ఖర్చు**

గత ప్రభుత్వం నిలిపేసిన కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 85 స్కీంల పునరుద్దరణకు రూ.18,701 కోట్లు ఖర్చు పెట్టామని దీని ఫలితంగా కేంద్రం నుంచి నిధుల విడుదల మరింతగా పెరిగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పునరుద్దరించడానికి తెచ్చిన వివిధ సంస్కరణలను బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. సాస్కీ కింద ఇప్పటి వరకు రూ.6,544 కోట్ల మేర నిధులను వినియోగించుకున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మరో రూ.1,438 కోట్లు సాస్కీ నిధులను వినియోగించుకునే అవకాశం ఉందని అన్నారు. సంపద సృష్టిలో భాగంగా ఏపీ వెల్త్ ఫండ్ ఏర్పాటును మంత్రి పయ్యావుల ప్రతిపాదించారు. రూ.100 కోట్ల కార్పస్‌తో ఏపీ వెల్త్ ఫండ్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ వెల్త్ ఫండ్ ద్వారా దేశంలోని వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడులను ప్రభుత్వం పెట్టనుంది. ఈ మేరకు ఏపీ వెల్త్ ఫండ్‌లో భాగస్వాములు కావాల్సిందిగా ప్రైవేట్ ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తున్నట్టు బడ్జెట్‌లో వెల్లడించారు. వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రాష్ట్ర ఖజానాకు ఆదాయం చేకూర్చేలా ప్రభుత్వం ప్రణాళికలు చేసింది.

# ప్రజల రాజధాని 'అమరావతి'ని నిర్మించాలనే నిబద్ధతతో ప్రభుత్వం పనిచేస్తోంది

-మొదటిపేజీ తరువాయి

రూ.57,868 కోట్ల విలువైన 97 పనులకు పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. ప్రజల రాజధాని అమరావతిని నిర్మించాలనే తమ ప్రభుత్వ నిబద్ధతకు ఇది స్పష్టమైన నిదర్శనమని పయ్యావుల అన్నారు. ఇతర పట్టణాల్లోనూ ప్రాజెక్టులు: ప్రజల రాజధాని అమరావతి అభివృద్ధికి మద్దతు అందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధ హోదా కల్పించే ప్రక్రియను ప్రారంభించినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలను మంత్రి పయ్యావుల కేశవ్ తెలియజేశారు. అమృత్ 2.0 పథకం కింద 117 పట్టణ, స్థానిక సంస్థలలో మొత్తం 506 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని అన్నారు. అదనంగా యూఐడీఎఫ్, ఏఐబీ సహకారంతో చేపట్టిన ప్రాజెక్టులు కూడా పురోగతిలో ఉన్నాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులన్నింటినీ 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పయ్యావుల కేశవ్ అన్నారు.

**25 లక్షల గృహాలు అందించడమే లక్ష్యం**

ఈ 2 ఏళ్ల వ్యవధిలో యూఐడీఎఫ్ కింద ఆంధ్రప్రదేశ్‌కు అదనంగా రూ.4 వేల కోట్లను మంజూరు చేసిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇక విశాఖపట్నం, విజయవాడ వంటి ప్రధాన నగరాల్లో ఆధునిక మెట్రో రైలు వ్యవస్థలో ప్రయాణించే కల త్వరలో సాకారం అవుతుందన్నారు. అలాగే ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పట్టణ), ఎన్టీఆర్ నగర్స్ కింద ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు 25 లక్షల గృహ పట్టాలు లేదా ఇళ్లను అందించి, సొంత ఇంటి కలను నెరవేర్చడమే మా ప్రభుత్వ లక్ష్యమని పయ్యావుల కేశవ్ తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు.



**బడ్జెట్ కేటాయింపులు**

2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ సంక్షేమ పథకాలు, వివిధ శాఖలకు నిధులు కేటాయించారు. విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు, రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులకు రూ.13,546 కోట్లు, అమరావతికి రూ.6,000 కోట్లు, పరిశ్రమలకు రూ.3,161 కోట్లు, పాఠశాల విద్యాశాఖకి రూ.32,308 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకి రూ.22,942 కోట్లు, పర్యావరణ అటవీశాఖకి రూ.714 కోట్లు కేటాయించారు. మున్సిపల్ శాఖకి రూ.14,539 కోట్లు, హోంశాఖకి రూ.9,165 కోట్లు, ఎక్సైజ్ శాఖకి రూ.500 కోట్లు, మౌలిక సదుపాయాల, పెట్టుబడుల శాఖకి రూ.1,283 కోట్లు, సమాచార సాంకేతిక శాఖకి రూ.536 కోట్లు, పౌరసరఫరాల శాఖకి రూ.3,821 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.500 కోట్లు, ఎస్సీ సంక్షేమం రూ.20,644 కోట్లు, ఎస్టీ సంక్షేమం రూ.9,190 కోట్లు, బీసీ సంక్షేమం రూ.51,021 కోట్లు, మైనారిటీ సంక్షేమం రూ.6,090 కోట్లు, మహిళాశిశు సంక్షేమం రూ.4,582 కోట్లు, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ రూ.19,306 కోట్లు, కార్మిక శాఖకి రూ.735 కోట్లు కేటాయించారు.

**బడ్జెట్‌లో పది ప్రాధాన్యత అంశాలు**

రాయసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్, నగర ఆర్థిక వ్యవస్థలు, వీబీ జీ రామ్ జీ, రాష్ట్ర సంపద నిధి, నేతలన్నలకు ఉచిత విద్యుత్, స్కూళ్లు, హాస్టళ్ల మౌలిక సదుపాయాలు, టీఆర్ఈడీఎస్ అమలు, క్వాంటమ్ కంప్యూటింగ్, దివ్యాంగులకు ఉచిత బస్సు సర్వీస్, 3 వేల కొత్త పోలీస్ వాహనాలను పది ప్రాధాన్యత అంశాలుగా పయ్యావుల కేశవ్ ప్రకటించారు.

## సామాజిక వర్గాన్ని నమ్ముకున్న వైసీపీ...

**విశాఖపట్టణం :** ఏదైనా ఒక్కసారి చేస్తేనే వర్క్ అవుట్ అవుతుంది. పదే పదే అదే మాట అంటే ప్రజలు వినరు. తెలంగాణలో కెసిఆర్ ని తీసుకుందాం. రెండుసార్లు తెలంగాణ సెంటిమెంట్తో ఎన్నికలకు వెళ్లి గెలిచారు. కానీ మూడోసారి మాత్రం సెంటిమెంట్ తగ్గించి.. జాతీయ భావాలతో వెళ్లారు. అయినా సరే అక్కడి ప్రజలు గుర్తించలేదు. ఏపీలో కూడా అటువంటి సీన్ ఉంది. ఎందుకంటే జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఎన్నో రకాల ప్రయోగాలు చేశారు. అందులో కులప్రయోగం ఒకటి. 2014లో కాపులకు రిజర్వేషన్లు ఇస్తానని ప్రకటించారు చంద్రబాబు. ఆ ఒక్క అంశాన్ని పట్టుకొని ముద్రగడ పద్మనాభం పెద్ద ఉద్యమమే చేశారు. అది అంతిమంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూర్చింది. కానీ అదే ముద్రగడ పద్మనాభం వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమాన్ని వదిలేశారు. అదే ముద్రగడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినా మొన్నటి ఎన్నికల్లో కాపులు ఇటువైపు చూడలేదు.కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు ముద్రగడ పద్మనాభం. 2016 జనవరి 31న తుని కేంద్రంగా ముద్రగడ నేతృత్వంలో కాపు గర్జన సభ ఏర్పాటు చేశారు. చివరకు ఆ ఉద్యమం రైలు తగలబెట్టే వరకు వచ్చింది. ముద్రగడపై కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డి రాజకీయంగా తీసుకున్న కొన్ని రకాల నిర్ణయాలు కాపులను ఆకర్షించాయి. నాడు ముద్రగడపై తెలుగుదేశం ప్రభుత్వం పెట్టిన కేసులను కాపు కులం పై జరిగిన దాడిగా చిత్రీకరించడంలో జగన్మోహన్ రెడ్డి సక్సెస్ అయ్యారు. తద్వారా అప్పట్లో టిడిపి పొలిటికల్ గా భారీ డ్యామేజ్ కు గురైంది.అయితే తాజాగా అంబటి రాంబాబు అరెస్టు ఎపిసోడ్ ను కాపులపై జరుగుతున్న దాడిగా చిత్రీకరించేందుకు మరోసారి ప్రయత్నాలు మొదలుపెట్టారు.

## 16న అమరావతికి బిల్ గేట్స్

-మొదటిపేజీ తరువాయి

నాలుగేళ్లలోనే అక్కడి పరిస్థితులు చాలా మారిపోయాయని చంద్రబాబు వివరించారు. సినీ హీరోగా బిజీగా ఉంటూ బాలకృష్ణ చెన్నైలో ఉంటే తాను 4ఏళ్లు అదే ఇంటిలో ఉన్నానని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో అక్కడికి సమీపంలో తన ఇల్లు పూర్తయ్యాక అప్పుడు అక్కడికి మారానన్నారు. అమరావతి అభివృద్ధిలోనూ ఇలాంటి గణనీయ మార్పులే ఉంటాయని స్పష్టం చేశారు.

**సీఎం చంద్రబాబుతో కీలక భేటీ!**

బిల్ గేట్స్ ఫిబ్రవరి 16న ఆంధ్రప్రదేశ్‌కు రానున్నారు. మొదట ఈ పర్యటన ఈనెల 18వ తేదీన ఉంటుందని అందరు భావించినా 2రోజుల ముందుగానే ఆయన రాష్ట్రానికి వస్తున్నారు. గేట్స్ పర్యటన రాష్ట్రంలో ఒక్క రోజే ఉంటుందా? లేక రెండు రోజులు? ఉంటారా? అనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. బిల్ గేట్స్ ఏపీ పర్యటనలో భాగంగా పలు అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగే సమీక్షలో పాల్గొంటారని సమాచారం. రాష్ట్రంలో విద్య, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణలో మెరుగైన ఫలితాలకు ాా× పరిజ్ఞానాన్ని అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో బిల్, మెలిండా గేట్స్ ఫౌండేషన్ ఇప్పటికే ఓ ఒప్పందాన్ని సైతం కుదుర్చుకుంది. అదేవిధంగా అత్యుత్తమ సాంకేతికత ద్వారా ప్రజల ఆరోగ్య అంశాలను పర్యవేక్షించేలా ప్రాజెక్టును కూడా చేపట్టింది. అంతేగాక బిల్ గేట్స్ ఫౌండేషన్ చేయూతతో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ హెల్త్ రికార్డులను తయారు చేయనుంది.

ఇప్పటికే చిత్తూరు జిల్లాలో సంజీవని ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇలాంటి విషయాలతో పాటు మరికొన్నివాటిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగే సమావేశంలో మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ చర్చిస్తారని సమాచారం. అలాగే రాజధాని అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీలో మైక్రోసాఫ్ట్ పెట్టే పెట్టుబడులపైనా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అనంతరం ఫిబ్రవరి 19వ తేదీన దిల్లీలో జరిగే ాా× సమిట్‌లో బిల్ గేట్స్ పాల్గొంటారు. సీఎం చంద్రబాబు సైతం ఈ సదస్సుకు హాజరవుతారు.

**అమరావతిలో భారీ క్వాంటమ్ కంప్యూటర్**

ఆంధ్రుల కలల రాజధాని అమరావతికి టెక్నాలజీలో సరికొత్త గుర్తింపుని తీసుకొచ్చేందుకు క్వాంటమ్ కంప్యూటింగ్ విప్లవానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఐటీ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ రాష్ట్రంలో రూ.1,772.08 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదించింది. ఇందులో భాగంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీలో 1,200 క్యూబిట్ సామర్థ్యమున్న (50 లాజికల్ క్యూబిట్స్) భారీ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులతో అధికారులు జరిపిన సంప్రదింపులు కొలిక్కి వచ్చాయి. మైక్రోసాఫ్ట్ కోసం క్వాంటమ్ వ్యాలీలో 4 వేల చ.అ. విస్తీర్ణంలో భవనాన్ని నిర్మించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

## గ్రూప్-1 నియామకాల్లో అక్రమాలు!

-మొదటిపేజీ తరువాయి

ఆంక్షలు లేకుండా పూర్తి అధికారం ఇచ్చారు. దర్యాప్తు అవసరాలకు ఏ ప్రభుత్వ శాఖ నుంచైనా అధికారుల నియామకానికి వెసులుబాటు కల్పించారు. ాాూజలో జరిగిన అక్రమాలపై సమగ్రంగా దర్యాప్తు చేసి ఈ ఏడాది మార్చి 16లోగా సిట్ తన నివేదికను హైకోర్టుకు సమర్పించాలని ప్రభుత్వం సూచనలు చేసింది.

**కీలక ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు**

ఏపీపీఎస్సీ గ్రూప్-1 జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై కొద్దిరోజులు కిందట ఏపీ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. మూల్యాంకనంలో అక్రమాలను తేల్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అదనపు డీజీ స్థాయి అధికారి పర్యవేక్షణలో సిట్ బృందం ఏర్పాటు చేయాలని న్యాయస్థానం పేర్కొంది. దర్యాప్తు జరిపేటప్పుడు రాష్ట్రం వెలుపల ఉన్న ఫోరెన్సిక్ నిపుణుల సహాయం తీసుకోవాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. విజయవాడలో జరిగిన మూల్యాంకనం సమయంలో వినియోగించిన బార్ కోడ్‌లు, అసలు ఓఎంఆర్ షీట్లు, వాటి వివరాలు ఒకదానితో ఒకటి సరిపోలుతున్నాయో? లేదో అనే విషయాన్ని విశ్లేషించాలని స్పష్టం చేసింది.

ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థులు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున వారందరినీ ప్రాధాన్యం లేని పోస్టులకు బదిలీ చేయాలని సీఎస్‌ను ఆదేశించింది. ఈ వ్యవహారంలో తీసుకున్న చర్యలపై నివేదికను కోర్టుకు సమర్పించాలని సీఎస్‌కు స్పష్టం చేసింది. మార్చి 16 లోపు గ్రూప్-1 జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై సిట్ నివేదికను కోర్టుకు సమర్పించాలని సూచించింది.

**169 గ్రూప్-1 పోస్టులకు 2018లో నోటిఫికేషన్**

2018లో అప్పటి ప్రభుత్వం 169 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా 2019లో పరీక్షలను నిర్వహించారు. 2021లో పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. జవాబుపత్రాలను డిజిటల్ వాల్యూయేషన్ చేశారని నోటిఫికేషన్ ప్రకారం మాన్యువల్‌గా మూల్యాంకనం చేయించాలని కోరుతూ పలువురు అభ్యర్థులు 2021లో హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. పిటీషన్‌పై విచారించిన న్యాయస్థానం మాన్యువల్‌గా మూల్యాంకనం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలతో ఏపీపీఎస్సీ 2022లో మాన్యువల్‌గా మూల్యాంకనం జరిపిన తర్వాత ఫలితాలను విడుదల చేసింది. గ్రూప్-1 ప్రధాన పరీక్షా జవాబు పత్రాలను హ్యాయ్ ల్యాండ్‌లో ఒకసారి, వేరే ప్రాంతంలో మరోసారి మూల్యాంకనం జరిపారని దీనివల్ల తాము అనర్హులు అయ్యామని పలువురు అభ్యర్థులు 2022లో హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు.

**అభ్యర్థులు కోర్టు తుది తీర్పుకులోబడే**


ఈ వ్యాజ్యాలపై హైకోర్టు సింగిల్ జడ్జి విచారణ జరిపింది. ఈ దశలో ఇంటర్వ్యూలను నిలువరించలేమన్న న్యాయస్థానం ఇంటర్వ్యూ నిర్వహించేందుకు అనుమతినిచ్చింది. ఇంటర్వ్యూలో సెలక్ట్ అయిన వారిని ఉద్యోగాల్లో నియమించాలని కోర్టు సూచించింది. నియామకాలు జరిపే సమయంలో అభ్యర్థులు కోర్టు తుది తీర్పుకులోబడే ఉండాలంటూ అండర్ టేకింగ్ లెటర్ తీసుకోవాలని ఏపీపీఎస్సీని ఆదేశించింది. గ్రూప్-1 ప్రధాన పరీక్ష జవాబుపత్రాల మాన్యువల్ మూల్యాకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న కారణంతో పరీక్షను రద్దు చేసి, తాజాగా నిర్వహించాలని హైకోర్టు సింగిల్ జడ్జి 2024 మార్చి 13న కీలక తీర్పు ఇచ్చారు.

**అక్రమాలను వెలికితీసేందుకు ప్రత్యేక దర్యాప్తు**

ఈ తీర్పును సవాలు చేస్తూ ఏపీపీఎస్సీ, ఉద్యోగాలు పొందిన వారు, పొందని వారు ధర్మాసనం ముందు వేర్వేరుగా అప్పీళ్లు వేశారు. అప్పీళ్లలో ఉద్యోగాలకు ఎంపికన అభ్యర్థులు కొందరు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. మాన్యువల్ మూల్యాంకనంలో జరిగిన అక్రమాలను వెలికితీసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

## మెడికల్ మాఫియా ఆగడాలు అరికట్టాలి : సిపిఐ సమరం

**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 14:**




రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మెడికల్ మాఫియా ఆగడాలను అరికట్టాలని సిపిఐరాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం ముందు శనివారం సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసనలో మాట్లాడిన సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ మాఫియా చేతిలో నకిలీ మందులు, కాలం చెల్లిన మందులు ప్రజలకు అందుతున్నాయని, ఈ ఆగడాలను అరికట్టడంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. నిబంధనలకు వ్యతిరేకంగా నడిచే మెడికల్ షాపులపై చర్యలు తీసుకోవడంలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ జిల్లా అధికారి పూర్తిగా వైఫల్యం చెందారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని చిత్తూరు జిల్లాలో మెడికల్ మాఫియాను అరికట్టకపోతే, భవిష్యత్తులో పెద్ద ఎత్తున ప్రజలను సమీక రించి తీవ్ర పోరాటం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో నగర కార్యదర్శి వి.సి. గోపీనాథ్, సీనియర్ నాయకులు ఏ.మని, దాసరి చంద్ర, సత్యమూర్తి, విజయ్ కుమార్, లతా రెడ్డి, బాలాజీ రావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్లో అన్ని రంగాలకు ప్రాధాన్యత హర్షనీయం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 14:**

ఆంధ్రరాష్ట్ర బడ్జెట్లో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం హర్షనీయమని కడ పొలిటికల్ చైర్మన్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఏపీ వార్షిక బడ్జెట్ పై హర్షం వ్యక్తం చేస్తూ ఓ ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ప్రధానంగా విద్య, వ్యయసాయ రంగాలకు అత్యధికంగా కేటాయింపులు చేయడం హర్షణయమని పేర్కొన్నారు. బడ్జెట్ లో విద్యారంగానికి రూ. 23 వేల 363 కోట్ల కేటాయించడం శుభ పరిణామం అన్నారు. తల్లికి వందనం పథకానికి రూ. 9668 కోట్ల కేటాయించడం అభినందనీయం అన్నారు. స్కాలర్ షిప్‌లు, ఉన్నతవిద్య, సమగ్ర శిక్షణ, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బోజనం ఫథకానికి అధిక నిధులు కేటాయించడం జరిగిందన్నారు. మనబడి-మన భవిష్యత్తుకు రూ. 1500 కోట్లు కేటాయించి బడులను అభివృద్ధి చేయాలని మంత్రి నారా లోకేష్ అడుగులు ముందుకు వేశారన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలు అభివృద్ధి చెందేలా బడ్జెట్‌లో విద్యాశాఖకు కేటాయింపులు పెంచడం జరిగిందన్నారు. మంత్రి నారా లోకేష్ పట్టుదల, కృషి ఫలితంగానే విద్యాశాఖకు అధిక నిధులు కేటాయింపు సాధ్యమైందని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో రైతులకు అన్యాయం జరిగిందని చెప్పారు. రైతును రాజుగా నిలపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం బడ్జెట్లో అధిక నిధులు కేటాయించడం జరిగిందన్నారు. వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో పెద్దపీట వేసిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.9960 కోట్లు, అన్నదాత సుఖీభవ పథకానికి రూ. 6600 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. రైతుల కోసం ప్రత్యేక బడ్జెట్ రూపొందించి సమర్థంగా అమలు చేస్తోన్నది రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని రైతుల కోసం ప్రత్యేక ప్రాజెక్టును ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రూ. 3.32 లక్షల కోట్లు బడ్జెట్ ప్రవేశ పెట్టిన ప్రభుత్వానికి 5 కోట్ల ప్రజలు అండగా ఉండాలని కోరారు. రాష్ట్ర ప్రజలంతా కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఈ సందర్భంగా కోరారు.

## సంజీవయ్య జయంతి.. ఏఆర్‌డీఎస్పీ నివాళులు



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 14:**

ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఏఆర్‌డీఎస్పీ చిన్ని కృష్ణ జిల్లా సాయుధ దళం కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో చిన్ని కృష్ణ మాట్లాడుతూ 38 ఏళ్ల చిన్న వయసులోనే ముఖ్యమంత్రి అయిన సంజీవయ్య ప్రజాసేవకు జీవితం అంకితం చేశారని తెలిపారు. సామాజిక న్యాయం, సమానావకాశాలు, పేదల సంక్షేమం ఆయన పాలన మూలస్తంభాలని, విద్య, ఉపాధి, గ్రామీణాబివృద్ధిలో తీసుకున్న నిర్ణయాలు ఆదర్శప్రాయమని చెప్పారు. సాధారణ కుటుంబం నుంచి అత్యున్నత స్థానాలకు ఎదిగిన ఆయన ప్రయాణం యువతకు స్ఫూర్తి, పట్టుదలతో ఏ శిఖరం చేరవచ్చో నిరూపిస్తుందని పేర్కొన్నారు. పోలీసులంతా సంజీవయ్య సేవాభావాన్ని ఆదర్శంగా ప్రజలకు న్యాయం, భద్రత అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రశేఖర్, ఏఆర్ సిబ్బంది పాల్గొని నివాళులు అర్పించారు.

### మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని

## రాళ్ళబూదుగూరులో రంగవల్లుల పోటీలు




**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి14:**

కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలంలోని రాళ్లబూదు గూరు గ్రామం నందు శనివారం మహాశివరాత్రి పురస్కరించుకొని సర్పంచ్ లక్ష్మీ మురుగేష్ పంచాయతీ సెక్రెటరీ శివయ్య, మరియు వార్డు సభ్యులు ఆధ్వర్యంలో శ్రీ కోదండ రామస్వామి వీధి నందు అత్యంత వైభవంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో పంచాయతీలోని వివిధ గ్రామాల నుండి యువతులు, మహిళలు పాల్గొని అందమైన రంగవల్లులు వేసినారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న కడ డెవలప్మెంట్ అడ్వైసింగ్ కమిటీ సభ్యురాలు సుగుణమ్మ, రెస్కో డైరెక్టర్ ఎస్ బసవరాజు, క్లస్టర్ ఇంచార్జ్ ఆర్ ఎస్ మణీ,మండల తెదేపా ఆర్గనైజింగ్ సెక్రటరీ బియ్యం కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలను ఎంపిక చేశారు. ఇందులో మొదటి బహుమతి శైలజ, రెండవ బహుమతి అమ్ములు,మూడవ బహుమతి ప్రేమ నాలుగవ బహుమతి బియ్యం సురేష్, ఐదవ బహుమతి పూజలను ఎంపిక చేశారు కృష్ణవేణి, యామినీలకు ప్రత్యేక బహుమతులను దాతల ద్వారా సేకరించిన బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో తెదేపా పంచాయతీ అధ్యక్షుడు జయరాజు, కో క్లస్టర్ వాజిద్, బి.ఎం.సురేష్, ఖలీమ్ ఎం.ఆర్.నారాయణ,రామప్ప, బిఎస్ఎన్ఎల్ మురళి, రమేష్, ఆనంద్, నటరాజు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చదవండి..
చదివించండి
చిత్తూరు ఎక్స్‌ప్రెస్

# నేటి తరానికి ఆదర్శం ధర్మబిక్షం సేవాభావం

ఆయన స్వాతంత్ర్య సమర యోధులు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు. నిజాం వ్యతిరేక ఉద్యమ కారులు. నిబద్దత కలిగిన రాజకీయ నాయకులు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా ప్రజా మద్దతుతో ఎన్నికై, అత్యంత సామాన్య జీవితం గడిపిన అసామాన్య నాయకులు. ఆయనే బొమ్మగాని ధర్మబిక్షం. బొమ్మగాని ధర్మబిక్షం యువకుడిగా విద్యార్థి నాయకులు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు. ఆర్య సమాజ్ బాధ్యులు. ప్రజా జీవితమే పరమావధిగా ఆజన్మ బ్రహ్మచారిగా గడిపిన ఆదర్శ నాయకులు. సామా జిక సేవకునిగా, గ్రామిణ పేదల హక్కుల కోసం పోరాటం, యువత, విద్యార్థులు అసంఘటిత కార్మికుల సంఘటితం, పేదలకోసం భూమి, ఇళ్ళ కొనుగోలు లాంటి కార్యక్రమా లలో అకుంఠిత కార్యదీక్ష, అంకిత భావంతో నిరంతరం అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆయన నల్లగొండ జిల్లాలోని మునుగోడు మండలం, ఊకొండి గ్రామంలో బొమ్మగాని ముత్తి లింగయ్య గౌడ్, పద్మ దంపతులకు 1922 ఫిబ్రవరి 15లో జన్మించారు. బొమ్మ గాని ధర్మబిక్షం తండ్రి చిన్నవయస్సులో సూర్యాపేటకు వచ్చి స్థిరపడ్డారు. ధర్మభిక్షం సూర్యాపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే జాతీయ భావాలు అలవరుచు కున్నారు. నిజాం పట్టాభిషేక రజతోత్సవాల సందర్భంగా పాఠశాలలో ఉత్స వాలు జరపాలన్న ప్రధానోపాధ్యా యుడి ఆదేశాలను వ్యతిరేకించి తోటి విద్యార్థులతో కలిసి బహిష్క రించారు. సామాజిక రుగ్మతలపై పోరాడటం కోసం తన సహ విద్యార్థులకు శిక్షణనివ్వటానికి విరాళాలు సేకరించి ఒక వసతి గృహం ఏర్పాటు చేశారు.సోవియట్ సోషలిస్ట్ విప్లవం, భారత దేశంలో జరిగిన అనేక సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు నల్గొండ జిల్లాలో మొదటి కమ్యూనిస్ట్ సెల్‌ను స్థాపించడానికి ధర్మభిక్షంను ప్రేరేపించాయి. అలా 1942లో సీపీఐలో చేరి,కమ్యూనిస్టు పార్టీతో అనుబంధాన్ని ఏర్పరచుకుని, ధర్మభిక్షం పార్టీలో పనిచేస్తూనే పాత్రికేయులుగా తెలంగాణలోని



నాటి ప్రముఖ పత్రికలైన మీజాన్, రయ్యత్, గోల్కొండల్లో పనిచేశారు. నిజాంపై సాయుధ పోరాటం మొదలైన తర్వాత తుపాకి చేత బట్టి యుద్ధరంగంలోకి దిగారు. సాయుధ పోరాటాన్ని విస్తరింప జేశారు. దేశ్‌ముఖ్ వ్యతిరేక పోరాటంలో భాగంగా పేరుమోసిన భూస్వామి విస్నూరు రామచంద్రా రెడ్డికి వ్యతిరేకంగా ధర్మభిక్షం విద్యా సంస్థల్లో నిరవధిక సమ్మెను నిర్వహించి,ఏడాదిన్నర పాటు అజ్ఞాత జీవితం గడిపారు. తర్వాత అరెస్టు కాబడి ఐదేళ్లకు పైగా జైలుశిక్షను అనుభవించారు. సూర్యా పేటలో, చంచల్ గూడ సెంట్రల్ జైలు, ఔరంగాబాద్, జాల్నా జైళ్లలో గడిపారు. స్వాతంత్ర్యం అనంతరం 1952లో తొలిసారిగా హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు సూర్యాపేట నియోజక వర్గం నుండి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆంధ్ర ప్రదేశ్ శాసనసభకు 1957లో నకిరేకల్ నుండి, 1962లో నల్గొండ నుండి ప్రాతినిధ్యం వహించారు. 1991లో, 1996లోనూ ఆయన ఎంపీగా నల్గొండ లోకసభ నియోజక వర్గం నుండి విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. 1996 లో 11వ లోక్‌సభ ఎన్నికలలో నల్లగొండ నుండి 480 మంది ఫ్లోరైడ్ బాధితులు పోటీ చేసినప్పటికి ఆయన 76 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. గీత పనివారల సంఘం ఏర్పాటు చేసి గౌడ కులస్తుల హక్కుల కోసం ఆయన చివరి వరకు పోరాడారు. తెలంగాణ ప్రాంతంలో శ్రమ జీవులను సమైక్య పర్చడంలో, పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం పాత్ర మారవ లేనిది. పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం ప్రధాన పాత్ర వహించి 'కార్మిక పక్షపాతి'గా గుర్తింపు తెచ్చు కున్నారు. ధర్మభిక్షం తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు, హిందీ భాషల్లో మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు.1951-73లో భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) జిల్లా మండలి, నల్గొండ కార్యదర్శిగా, 1952-57, 1957-62, 1962-67 ఆంధ్రప్రదేశ్ శాసనసభ శాసన సభ్యులుగా, 1972 నుండి ఆంధ్రప్రదేశ్ సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1991లో 10వ లోక్ సభ సభ్యులుగా, 1991-96 సంప్రదింపుల కమిటీ, గ్రామీణాభివృద్ధి శాఖ సభ్యులుగా.1992-95 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి, సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1996 లో 11వ లోక్ సభ సభ్యులుగా, భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ), జాతీయ మండలి సభ్యులుగా పనిచేసిన విశేష అనుభవం గడించారు. నిజాం హయాంలో రైతాంగ ఉద్యమంలో పాల్గొని, భారత ప్రభుత్వం నుంచి తామ్రపత్ర పురస్కారం అందుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ లో 2019 నవంబర్ 8న రోజున బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ధర్మబిక్షం నీతి, నిజాయితీకి ఆదర్శనీ యుడని ఆయన జీవిత చరిత్రను పాఠ్యాం శంలో చేర్చాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆ సందర్భం గా అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. జీవితాంతం ప్రజా సేవకే అంకితమై, సోదరుని కుమారున్ని దత్తత తీసుకుని, అవివాహితులుగానే ఉన్నారు. 89 ఏళ్ళ వయసులో ఇంట్లో జారి పడటంతో ఆయన తుంటి ఎముకకు దెబ్బ తగలగా, హైదరాబాద్‌లోని పైవేటు ఆసు పత్రిలో ఫిబ్రవరి 11న శస్త్రచికిత్స జరిపించుకొని, తర్వాత ఊపిరి తిత్తుల సమస్యతో చికిత్స పొందుతూ 2011, మార్చి 26న మరణించారు. పోరాట యోధుని గా, అసామాన్య ప్రజా సేవకునిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పొందారు.

# తెలుగునేలపై శైవమత వ్యాప్తి

చారిత్రక యుగమున శాతవాహన, చాళుక్య, రాష్ట్రకూట, కాకతీయ, అనంతర కాలమున హైందవ సంస్కృతీ సభ్యతలకు ఆలవాలమైన తెలుగు నేలలో వివిధ రాజన్యుల ఏలుబడులలో శైవమతం పరిడవిల్లింది. క్రీ.పూ.2వ శతాబ్ది నాటికే తెలుగు నేలలో శైవారాధన ఉంది. గాథా సప్తశతిలో గౌరీ, పశుపతి స్తోత్రముంది. 1వ శతాబ్దంలో శైవంలో అత్యంత ప్రాచీనమైన పాశుపత శైవాన్ని లకులీస శివాచార్యుడు స్థాపించారు. చేతికందుతున్న చరిత్ర ఆధారంగా శ్రీముకుడు కాణ్వ రాజైన సుశర్మను వధించి, మగధను ఆక్రమించి, శాతవాహన రాజ్యాన్ని స్థాపించాడని, వివిధ చరిత్రకారుల అభిప్రాయాన్ని అనుసరించి, శ్రీ.పూ.1వ శతాబ్దిగా స్పష్టమవుతున్నది. శ్రీముకుడు జైన మతాన్ని స్వీకరించి, అనేక ఆలయాలను నిర్మించాడు. శాతవాహన 17వ రాజైన హాల చక్రవర్తి, సింహళ రాకుమారి లీలావతిని సప్త గోదావరీ తీరస్థ భీమేశ్వరాలయం, నేటి జగిత్యాల జిల్లాలోని వేంపెల్లి వెంకటరావుపేటలో వివాహ మాడినట్టు నాటి భీమేశ్వరాలయం ఉన్నట్లు నిరూపితమైంది. బౌద్ధమతంలోనూ నాగదేవత అరాధన ఉంది. స్థూపాలను పెనవేసుకున్న నాగ సర్పాల చిత్రాలు ప్రధానంగా ధూళికట్ట స్థూపంపై ఐదుతలల నాగ ముచిలింద శిల్పాన్ని చూడవచ్చు. ఇక్ష్వాకు (క్రీ.శ.253, 277) రాజైన ఎహువల శాంతమూలుని సేనానియైన ఎలిశ్రీ ఏలేశ్వరం నిర్మించి, సర్వదేవాలయమనే శివాలయాన్ని నిర్మించాడు. ఆయన కాలంలో విజయపురిలో కార్తికేయ, పుష్పభద్ర స్వామి, నోడిగిరీశ్వర, దేవీ ఆలయాలు నిర్మితాలైనాయి. ఇక్ష్వాకుల కాలంలో మాతృ దేవతారాధన కూడా ఉండేది. నాగార్జున కొండలో హరీతి ఆలయం నిర్మించబడింది. ఆలయంలో సప్తమాతృకల వద్ద గాజులను సమర్పించే వారని శాసనాధారం. వీరికాలంలో స్కంద గణపతి, యక్షుడు, హరీతి దేవత లను పూజించేవారు. అనంతర వాకాట రాజులలో అధికులు శైవులు. మొదటి రుద్రసేనుడు మహా భైరవుని భక్తుడు కాగా, మొదటి పృథ్వీసేనుడు మహేశ్వర భక్తుడు. క్రీ.శ.358నుండి 569వరకు 210 ఏళ్ళు తెలంగాణను, ఉత్తరాంధ్రను పాలించిన విష్ణుకుండినులు నేటి మహబూబ్ నగర్ జిల్లాలోని అమ్రాబాద్ (అమల పురం), నల్గొండ జిల్లాలోని వలిగొండ మండలం లోని ఇంద్రపాల నగరం. కొంతకాలం బెజవాడను రాజధానిని చేసుకున్నారు. వీరు బ్రాహ్మణ మతావ లంబులు, శివభక్తులు. రెండవ మాధవవర్మ (క్రీ.శ.440-495) 100కుపైగా యుద్ధాలు చేసి, విజయాలు సాధించి, ఒక్కొక్క విజయానికి గుర్తుగా కీసర గుట్టపైన ఒక లింగ ప్రతిష్ఠ చేశాడు. విజయం సాధించిన చోటల్లా రామలింగేశ్వర ఆలయం కట్టించాడు. శ్రీశైలం మల్లికార్జుననికి చంద్రగుప్తుడు అనే రాజు బంధువైన చంద్రవతి ప్రతి ష్ఠించినదని చెపుతున్న గుప్త మహేశ్వర ఆలయ శిథిలాలు, నేటికీ శ్రీశైల ఉత్తర ద్వార క్షేత్రమైన ఉమా మహేశ్వరానికి ఉత్తరాన ప్రతాప రుద్ర కోటకింద వాయవ్య మూలన రోడుకు దక్షిణాన ఉన్నాయి. శ్రీశైల మల్లికార్జునుడు విష్ణుకుండినుల కాలంలోనే బహుళ ప్రచారం పొందాడు. గోవింద వర్మ అనేక దేవాలయాలు కట్టించాడు. 2వ మాధవ వర్మ అనేక రామ లింగేశ్వరాలయాలు కట్టించాడు. గుంటూరు జిల్లా లోని సత్తెనపల్లి తాలూకా వేల్పూరులో, ఈ ఊరులో, కీసరగుట్టలో రామలింగే శ్వరాలయాలు నేటికీ దర్శనీయ స్థలాలే. తూర్పు చాళుక్య 2వ విజయాదిత్యుడు 108 విజయాలకు గుర్తుగా 108 భీమేశ్వరాలయాలు నిర్మించాడు. జైన మతం విష్ణుకుండినుల కాలంలోనే దాదాపు కనుమరుగు కాగా, జైన ఆలయాలు శివాలయాలైనాయి. అలంపురం విష్ణుకుండినుల కన్నా ముందువారైన ఇక్ష్వాకుల నుంచే మనుగడలో ఉండేదని శాసనాధా రంగా ఉంది. వేములవాడ చాళుక్యులు, వేములవాడలో నిర్మించిన రాజరాజేశ్వరాలయం తెలంగాణ లోని ప్రముఖ శివాలయం. బద్దెగ (క్రీ.శ.850-895) వేములవాడలో బద్దిగేశ్వర (భీమేశ్వర) ఆలయాన్ని నిర్మించాడు. క్రీ.శ.7వ శతాబ్ది శాసనంలో శివమండల దీక్ష ప్రసక్తి ఉంది. శ్రీశైలం, అలంపురం, బెజవాడ, పిఠాపురం నాటి శక్తి పూజా కేంద్రాలు. బసవేశ్వరుడు (క్రీ.1100-70) వీర శైవోద్యమాన్ని ప్రారంభించాడు. అనంతరం మల్లికార్జున పండితుడు శైవాన్ని ప్రచారం చేశాడు. చాళుక్య భీముడు ద్రాక్షారామంలో భీమేశ్వరాలయం నిర్మించాడు. భీమవరం, పాలకొల్లు, అమరావతి ఆలయాలు చాళుక్య నిర్మాణాలే. యుద్ధ మల్లుడు బెజవాడలో కుమారస్వామి, 2వ విక్రమాదిత్యుని భార్య మహాదేవి, పట్టడకల్ లో శైవాలయాన్ని నిర్మించారు. రాష్ట్రకూటుల కాలంలో ఎల్లోరా గుహలు మలుచ బడ్డాయి. కైలాసనాథ ఏక శిలాలయం మొదటి కృష్ణుని అద్భుత సృష్టి. కాలాముఖి, కాపాలిక తెగలు ప్రచారం లోకి వచ్చాయి. కాకతీయులు కాకతి మాతృదేవతారాధకులుగా అభిప్రాయాలున్నాయి. గ్రామదేవత యైన ఏకవీర ఆరాధన నాడు బహుళ ప్రచారంలో ఉంది. వీరికాలంలో జైన బౌద్ధ, వీరశైవుల మధ్య ఘర్షణలు తారాస్థాయికి చేరాయి. ఇందుకు భిన్నంగానే తిక్కన హరిహర తత్వాన్ని బోధించాడు. కాళేశ్వరంలో శివలింగ ప్రతిష్ఠ చేసింది 2వ ప్రోలరాజు గురువైన రామేశ్వర పండితుడు. కాకతీయ పరిపాలనలో ధర్మపురి, అనుమకొండ, ఐనవోలు, పానగల్లు, నందికంది, శనిగరం, పుష్పగిరి, అమరావతి, సామర్లకోట, భీమ వరం, పాలకొల్లు, ద్రాక్షారామం గొప్ప శైవక్షేత్రాలు. ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రలో కాకతీయుల కాలంలో 5500 శైవాలయాలు, 1300 వైష్ణవాల యాలు, 2400 మల్లారదేవుని గుళ్ళ...భైరవ, దుర్గ గణపతి దేవుళ్ళవి కలిపి 4400 గుడులు ఉండేవని స్పష్టమవు తున్నది. వెలమరాజుల కాలంలో కాళిక, దుర్గ, చండి, భద్రకాళి, మహిశాసుర మర్ధిని, కట్టమైసమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, ఏకవీర దేవతల ఆరాధన ఉన్నట్లు తెలుస్తున్నది.

# అలుపెరుగని పోరాట యోధుడు

నరెడ్ల శ్రీనివాస్ అంటే తెలియక పోవచ్చు కాని, లోక్ సత్తా శ్రీనివాస్ అనగానే ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమే. చాలా మంది ఆయనను లోక్ సత్తా శ్రీనివాస్ అనే పిలిచేవారు. సామాజిక న్యాయం, ఉద్యమాలకు ఆయన కేర్ ఆఫ్ అడ్రస్ గా నిలిచారు. ఉత్తర తెలంగాణలో గత ఆనాలుగు దశాబ్దాలుగా కొనసాగిన సామాజిక ఉద్యమాలతో ఆయన భాగస్వామ్యం లేని ఉద్యమమే లేదంటే అతిశయోక్తి కాదు. లోక్ సత్తా ఉద్యమ సంస్థతో గత పాతికేళ్లుగా ఆయనకు విడదీయరాని సంబంధం ఉంది. లోక్ సత్తా అంటే శ్రీనివాస్. శ్రీనివాస్ అంటే లోక్‌సత్తా అని పేరెన్నికగన్నారు. అవినీతి, అన్యాయాలు అక్రమాలపై నిరంతరమైన పోరాటాలు చేశారు. ఎన్నో విజయాలు సాధించారు. కరీంనగర్‌లో ఉన్న అన్ని ఉద్యమ వేదికలు ఆయనవే. గత సామాజిక ఉద్యమాలతో ఆయనకు విడదీయరాని బంధం సంబంధం అనుబంధం ఉన్నాయి. ఆయన ప్రతి ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. వాస్తవానికి ఉద్యమాలను నిర్మించారంటే సమంజసంగా ఉంటుంది. ఉద్యమాల నిర్వహణలో అలుపెరగక, ఏనాడూ రాజీపడక, మొక్కవోని ధైర్యంతో, చెక్కుచెదరని ఆత్మ విశ్వాసంతో, అకుంఠిత కార్యదీక్షతో, అంకితభావంతో, అన్నింటినీ మించి చిత్తశుద్ధితో, ఉద్యమాలలో మమేకమైన పోరాటయోధుడు. 1955లో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామంలో నిరుపేద కుటుంబంలో నరెడ్ల శ్రీనివాస్ జన్మించిన శ్రీనివాస్... యూనియన్ బ్యాంకులో ఉద్యోగం చేస్తూ, బ్యాంకు మేనేజర్ గా ప్రమోషన్ మీద కొంత కాలంగా రాష్ట్రం విడిచి వెళ్ళిన సందర్భంలోనూ, ఏనాడూ ఉద్యమ కార్యాచరణను ఆయన వదిలిపెట్టలేదు. వినియోగదారుల మండలి తరపున వందలాది కేసులు వేసి హక్కులను పరిరక్షిం చేందుకు కృషి చేశారు. అవినీతి అధికారులను ఏసీబీకి పట్టించడంలో కృషి చేసిన వారిని సన్మానించి ప్రోత్స హించేవారు. పాలకుల తప్పులను, ప్రభుత్వ పాలసీల్లోని లోపాలను ఎత్తిచూపడంలో, ప్రజా సమస్యలతో పాటు, సామాన్య బాధితుల న్యాయం కోసం పోరాడ డంలో ఆయన వ్యక్తిత్వం అనన్య సామాన్యం. ఉమ్మడి రాష్ట్ర వినియోగ దారుల మండలి అధ్యక్షుడిగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో అందరికీ అందు బాటులో ఉండేలా కిరాయి ఇల్లు వేదికగా, కరీంనగర్ వినియోగ దారుల మండలి నిర్వాహక బాధ్యునిగా, వేలాది కేసులను ఆయన పరిష్కరించారు. అన్యా యానికి గురైన వారు తమకు న్యాయం తప్పక జరుగుతుందని నమ్మకంతో, లోక్ సత్తా ఆఫీసును వెతుక్కుంటూ వచ్చేవారు. వారి సమస్య పరిష్కారం అయ్యే దాకా సలహాలు సూచనలు అందించడమే కాక, వెంట ఉండి సహకరించే వారు. హుజురాబాదులో జన్మించిన 69ఏళ్ళ శ్రీనివాస్.. విద్యార్థి జీవితంలోనే ప్రగతిశీల భావాలు కలిగి, ఆనాటి పోరాట, విప్లవ యోధుల సాహచర్యంతో ఎదిగారు. 1970వ దశక ప్రారంభంలో మిత్రులతో కలిసి హుజురాబాద్‌లో సాహితీ సంస్థ స్థాపనకు చొరవ చూపి, మహాకవి శ్రీశ్రీని ఆహ్వానించి, హుజురాబాద్ లో సమావేశాలు నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించారు. కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్ కాలేజీలో డిగ్రీ, ఉస్మానియాలో పీజీ పూర్తి చేసి, కరీంనగర్ యూనియన్ బ్యాంక్ లో ఉద్యోగంలో చేరారు. ప్రగతి శీల, భావజాల పరిధిని విస్తృత పరుచుకుని, తన లాంటి భావాలున్న వారితో జత కట్టారు. ఒకనాడు జర్నలిస్టులకు వేదికగా, ఎందరో జర్నలిస్టులను తయారు చేసి, జర్నలిస్టుల తయారీ కర్మాగా రంగా విలసిల్లిన, విజయ కుమార్ సంపాదకత్వంలో వెలువరించిన 'జీవగడ్డ పత్రికలో వారం వారం 'పెన్నుపోటు' పేర కాలమిస్టు గా పని చేశారు. ఆకాలంలో జీవగడ్డలో పని చేసిన అల్లంనారాయణ, ఘంటా చక్రపాణి, ఆనాడు జిల్లాలో విధులు నిర్వర్తించిన సీనియర్ జర్నలిస్టు మిత్రులు దేవులపల్లి అమర్, దామెర్ల సాయిబాబా, ఎస్. కే.జకీర్ తదితరులతో సాన్నిహిత్యాన్ని పెంచుకున్నారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143